


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
బుధవారం
27 నవంబర్ 2024
పేజీలు: 02



## ఓడిపోయినప్పుడు మాత్రమే నాయకులు
### ఈవీఎంల ట్యాంపరింగ్ గురించి మాట్లాడుతారా

ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు బ్యాలట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నందున భారత్ లోనూ ఈవీఎంల స్థానంలో బ్యాలట్ పేపర్‌ను పునఃప్రవేశపెట్టేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టేసింది. ఓడిపోయినప్పుడు మాత్రమే నాయకులు ట్యాంపరింగ్ గురించి మాట్లాడుతున్నారని.. గెలిచినప్పుడు ఎవ్వరూ ట్యాంపరింగ్ జరిగిందని మాట్లాడటంలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యనించింది. మనం మిగతా ప్రపంచానికి ఎందుకు భిన్నంగా ఉండకూడదు.. బ్యాలట్ పేపర్లో జరిగితే ఏంటి? ఈవీఎంలతో జరిగితే ఏంటి? మనం మళ్లీ బ్యాలట్ వైపు మళ్లితే అవినీతి పోతుందని ఎలా చెబుతారని ప్రశ్నించిన కోర్టు.




## బజరంగ్‌పై నిషేధం

భారత స్టార్ రెజ్లర్ బజరంగ్ పునియా వేటు పడింది. డోపింగ్ పరీక్ష కోసం శాంపిల్స్ ఇవ్వని కారణంగా జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(నాడా) మంగళవారం బజరంగ్‌పై నాలుగేండ్ల నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. జాతీయ జట్టు సెలెక్షన్స్ ట్రయల్స్ సందర్భంగా గత మార్చి 10న జరిపిన డోపింగ్ టెస్టుల కోసం శాంపిల్స్ ఇచ్చేందుకు పునియా నిరాకరించిన కారణంగా నాడా ఈ నిర్ణయానికి వచ్చింది.దీంతో ఇప్పటి నుంచి పునియా ఎలాంటి పోటీల్లో బరిలోకి దిగే అవకాశం లేదని నాడాకు చెందిన యాంటీ డిసిప్లీనరీ డోపింగ్ ప్యానెల్(ఏడీడీపీ) పేర్కొంది.



## రోడ్డు ప్రమాదంలో నలుగురు డాక్టర్లు మృతి

ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో.. నలుగురు డాక్టర్లు మృతిచెందారు. వారితో పాటు ఓ ల్యాబ్ టెక్నీషియన్ కూడా ప్రాణాలు కోల్పోయాడు. సైఫాయిలో ఉన్న యూపీ మెడికల్ యూనివర్సిటీ డాక్టర్లు రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. అతివేగంతో వెళ్తున్న ఎస్‌యూవీ వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ తర్వాత అటుగా వస్తున్న ఓ ట్రక్కు ఆ వాహనాన్ని ఢీకొన్నట్లు ఎస్పీ అమిత్ కుమార్ తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో.. ఎస్‌యూవీ వాహనం డివైడర్‌ను ఢీకొని మరో లేన్‌లోకి వెళ్లింది. అప్పుడు ఆ లేన్‌లో వస్తున్న మరో వాహనం ఢీకొనడంతో నలుగురు డాక్టర్లు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. ల్యాబ్ టెక్నీషియన్ కూడా స్పాట్‌లోనే చనిపోయాడు. డాక్టర్ల ప్రయాణిస్తున్న వాహనంలో ఉన్న ఓ పీజీ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. తిర్వాలోని అంబేద్కర్ మెడికల్ కాలేజీలో అతన్ని చేర్పించారు. మృతిచెందిన వారిలో డాక్టర్ అనిరుధ్ వర్మ, డాక్ర్ సంతోష్ కుమార్ మౌర్య, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ నర్‌దేవ్ ఉన్నారు. లక్నోలో ఓ పెళ్లికి హాజరై తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

## 50 మిలియన్ వ్యూస్‌తో కిస్సిక్ సెన్సేషన్


టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ మూవీ ‘పుష్ప-2’ మరో పదిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాతో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, క్రియేటివ్ జీనియస్ సుకుమార్ ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తారా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమా నుండి రిలీజ్ అయిన పాటలు ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలను క్రియేట్ చేస్తున్నాయి. రీసెంట్‌గా రిలీజ్ అయిన స్పెషల్ ఐటెం సాంగ్ ‘కిస్సిక్’ ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా మారింది. ఈ పాట రిలీజ్ కావడంతోనే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఇక యూట్యూబ్‌లో ఈ పాట ఏకంగా 50 మిలియన్ వ్యూస్‌తో రికార్డు క్రియేట్ చేయడమే కాకుండా నెం.1గా ట్రెండ్ అవుతోంది. ఈ పాటలో యంగ్ బ్యూటీ శ్రీలీల అదిరిపోయే డ్యాన్స్ స్టెప్పులు వేయడంతో ఈ సాంగ్‌ను బిగ్ స్క్రీన్స్‌పై ఎప్పుడెప్పుడు చూద్దామా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.





## దిలావర్‌పూర్‌లో ఉద్రిక్తత..
### పోలీసులపైకి రాళ్లు రువ్విన ఆందోళనకారులు

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును రద్దు చేయాలని కోరుతూ చేపట్టిన మహాధర్నా ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. రెండురోజులుగా మండలంలో రైతులు మహాధర్నాకు పిలుపునివ్వగా పోలీసులు కొంత మంది రైతు ప్రతినిధులను అరెస్టు చేయడంతో ఉద్రిక్త పరిస్థితులకు కారణమైంది.అరెస్టు చేసిన ఆందోళనకారులను విడుదల చేయాలని కోరుతూ బుధవారం రైతులు, మహిళలు పోలీసుస్టేషన్ నుంచి నిర్మల్- భైంసా రహదారి వైపు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహిళలు పురుగుల మందు డబ్బాలతో నిరసన తెలిపారు.పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఆందోళనకారులు తిరగబడ్డారు. ఒక దశలో పోలీసులపైకి రాళ్లు రువ్వారు. దాదాపుగా రెండు గంటలుగా అక్కడి పరిస్థితులు ఉద్రిక్తత మారాయి. జాతీయ రహదారిపై ఆందోళనకారుల బైఠాయించడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ఇథనాల్ పరిశ్రమ వల్ల తమ వ్యవసాయ భూములు పనికి రాకుండా పోతాయని స్థానికులు వాపోతున్నారు. పరిశ్రమను రద్దు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. ఇన్‌చార్జి మంత్రి సీతక్క , స్థానిక ఎమ్మెల్యే ఇథనాల్ రద్దు విషయమై వెల్లడించేంత వరకు తమ ఆందోళన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు.



## ఢిల్లీలో తీవ్రంగానే గాలి కాలుష్యం

ఢిల్లీలో వాయు కాలుష్య తీవ్రత కొద్దిమేర తగ్గింది. ఇటీవలే కాలంలో ఢిల్లీ – ఎన్సీఆర్ ప్రాంతంలో ఏక్యూఐ లెవల్స్ 400కి పైనే నమోదైన విషయం తెలిసిందే. తాజాగా గాలి నాణ్యత సూచీ 300 నుంచి 400 మధ్యే నమోదవుతోంది. అయినప్పటికీ తీవ్రమైన కేటగిరీలోనే ఉంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. బుధవారం ఉదయం 7 గంటలకు ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 301గా రికార్డైంది. లోధి రోడ్‌లో 254, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3 వద్ద 298, ఓఖ్లా ఫేజ్‌లో 298, డీటీయూలో 250, పూసాలో 281గా నాలి నాణ్యత సూచీ నమోదైంది. కొన్ని స్టేషన్లలో ఏక్యూఐ లెవల్స్ తీవ్రమైన విభాగంలో నమోదయ్యాయి. అశోక్ విహార్‌లో 316, ఆనంద్ విహార్‌లో 311, ఐటీవో ప్రాంతంలో 316, వజీర్‌పూర్‌లో 331, వివేక్ విహార్‌లో 318, షాదీపూర్‌లో 375గా గాలి నాణ్యత సూచీ నమోదైంది. గాలి కాలుష్యానికి తోడు నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకర స్థాయిగా పరిగణిస్తారు.






## మరోసారి కెప్టెన్‌గా కోహ్లీ?

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ మరోసారి బాధ్యతలు చేపట్టనున్నాడా? ఈ విషయంపై ఇప్పటికే ఫ్రాంచైజీ, కోహ్లీ మధ్య చర్చ జరిగిందా? ఐపీఎల్ 2025 నుంచి కోహ్లీనే ఆర్సీబీ కెప్టెన్‌గా ఉంటాడా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ మేరకు ఐపీఎల్ రిటెన్షన్ లిస్ట్ ఇచ్చేందుకు మరికొన్ని గంటలే ఉన్న నేపథ్యంలో కోహ్లీ మరోసారి ఆర్సీబీ కెప్టెన్‌గా నియమితుడవుతాడనే ప్రచారం జోరందుకుంది.గడిచిన మూడు సీజన్‌లుగా ఫాఫ్ డుప్లిసిస్.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్‌గా ఉన్నాడు. అయితే, ప్రస్తుతం అతడి వయసు 40 ఏళ్లు. దీంతో అతడిని రిటైన్ చేసుకోవడానికి ఆర్సీబీ మేనేజ్‌మెంట్ ఆసక్తిచూపడం లేదని తెలుస్తోంది. ఐపీఎల్ ప్రారంభం నాటి నుంచి ఆడుతున్నప్పటికీ ఆర్సీబీ ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేదు. దీంతో ఈసారి మెగా వేలంలో పక్కా ప్లాన్‌లను అమలు చేసి.. టైటిల్ అందించే ఆటగాళ్లతో జట్టును బలంగా చేసుకోవాలని ఆ జట్టు భావిస్తోంది. ఈ నేపథ్యంలో డుప్లెసిస్‌ను వదిలేయాలని ఆర్సీబీ డిసైడ్ అయినట్లు సమాచారం.విరాట్ కోహ్లీ.. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తరఫున అరంగేట్రం చేశాడు. అప్పటి నుంచి ఇదే జట్టు తరఫున ఆడుతున్నాడు. తాను చివరి ఐపీఎల్ మ్యాచ్ కూడా ఇదే జట్టు తరఫున ఆడతానని ఇదివరకే చెప్పేశాడు. ఇక విరాట్ కోహ్లీ 2013 నుంచి 2021 వరకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్‌గా వ్యవహరించాడు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4 PM

## ప్రజలు తిరగబడతారని ప్రభుత్వ పెద్దల్లో వణుకు

**ఎమ్మెల్సీ కవిత**



తాము చేసిన తప్పులకు ప్రజలు తిరగబడతారని.. ప్రభుత్వ పెద్దల్లో వణుకు పడుతోందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. మాగునూరు జెడ్పీ హైస్కూల్‌లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తారని, ప్రజలతో కలిసి ఉద్యమిస్తారనే భయంతో తెల్లవారుజామునే అక్రమ అరెస్టులకు తెరలేపింది కాంగ్రెస్ సర్కార్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజా పాలను అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు, ప్రజలు నిలదీస్తారనే భయంతో బీఆర్ఎస్ నేతలు, ప్రజలను నిర్బంధిస్తూ, తెలంగాణ ఉద్యమం నాటి సమైక్య రాష్ట్ర ప్రభుత్వ అణిచివేతలను తలపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాం మోహన్ రెడ్డి, కార్యకర్తల ముందస్తు అరెస్టును తీవ్రంగా ఖండించారు. తెలంగాణ గడ్డ పోరాటాల పురిటిగడ్డ.. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా తిరుగుబాటులను అణిచివేయాలనుకోవడం మూర్ఖత్వమన్నారు.

## ఎటు చూసినా అందాల రాశి

రాశీ ఖన్నా.. తెలుగులో 'ఊహలు గుసగుసలాడే' మూవీతో తెలుగు తెరపై ఎంట్రీ ఇచ్చింది. తొలి సినిమాలోనే హీరోయిన్ గా జోరు చూపించిన ఈ రాశీ ఖన్నా.. ప్రస్తుతం టాలీవుడ్ లో సరైన ఛాన్సులు లేక పక్క ఇండస్ట్రీ చూపులు చేస్తోంది. అంతేకాదు అందాల ఆరబోతలో హద్దులు చెరిపేస్తోంది.రాశి ఖన్నా.. తెలుగులో తనదైన శైలిలో దూసుకుపోతుంది. కానీ స్టార్ హీరోయిన్ రేంజ్‌కు కాస్త దూరంలో ఆగిపోయింది ఈ భామ. అందుకే పక్క ఇండస్ట్రీ వైపు చూస్తోంది.రాశి ఖన్నా.. కేవలం సినిమాల్లో మాత్రమే కాదు.. వెబ్ సిరీస్‌లో కూడా అలరించింది. అజయ్ దేవ్‌గణ్ 'రుద్ర'తో పాటు రాజ్ అండ్ డీకే తెరకెక్కిన 'ఫర్జీ' వెబ్ సిరీస్‌లతో ప్యాన్ ఇండియా లెవల్లో చెలరేగిపోతుంది. తెలుగులో 'ఊహాలు గుసగుసలాడే' మూవీతో పరిచయమైన రాశీ.. ఆ తర్వాత గోపీచంద్‌తో చేసిన 'జిల్'చిత్రంతో టాలీవుడ్ ప్రేక్షకుల మనసును దోచుకుంది.జిల్ తర్వాత గోపీచంద్ సరసన 'పక్కా కమర్షియల్' సినిమాలో నటించింది. మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా పెద్దగా మెప్పించలేక పోయింది. టాలీవుడ్ లో ఎన్టీఆర్‌తో 'జై లవకుశ' తప్పించి మిగతా టాలీవుడ్ బడా స్టార్ హీరోల సినిమాల్లో మాత్రం రాశీ ఖన్నాకు సరైన ఛాన్సులు దక్కలేదనే చెప్పాలి.



# మెగా డీఎస్సీ కొత్త సిలబస్ వచ్చేసింది




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు పాఠశాల విద్యాశాఖ కీలక అప్‌డేట్ అందించింది. ఇప్పటికే కొన్ని కారణాలతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అభ్యర్థులు నోటిఫికేషన్ విడుదలయ్యేంత వరకు ఎదురు చూడకుండా సన్నద్ధత కొనసాగించాలని ఇటీవల విద్యాశాఖ వెల్లడించింది. ఇందుకు అనుగుణంగా డీఎస్సీ సిలబస్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలో డీఎస్సీ సిలబస్ నవంబర్ 27 (బుధవారం)వ తేదీన విడుదల చేసింది. ఈ మేరకు ఏపీ డీఎస్సీ వెబ్‌సైట్‌లో సిలబస్‌ను పాఠశాల విద్యాశాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. నవంబర్ 27వ తేదీ ఉదయం 11 గంటలకు మెగా డీఎస్సీ సిలబస్ విడుదల చేసినట్లు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు తెలిపారు. అభ్యర్థులు మెగా డిఎస్సి సిలబస్‌ను అధికారిక వెబ్‌సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు.

డీఎస్సీ నోటిఫికేషన్ మరింత ఆలస్యం!

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి సంబంధించిన మెగా డీఎస్సీ 2024 నోటిఫికేషన్ విడుదల మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఏపీ సర్కార్ ఎస్సీ వర్గీకరణ పూర్తి చేశాకే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని భావిస్తోంది. ఇందుకు కనీసం 2,3 నెలల సమయం పడుతుందని ఇప్పటికే చెప్పింది. అయితే తిరిగి ఎప్పుడు విడుదల చేస్తారన్న అంశంపై మాత్రం అధికారికంగా స్పష్టత లేదు. మరోవైపు డీఎస్సీ నోటిఫికేషన్ 2, 3 నెలలపాటు వాయిదా వేసినప్పటికీ అనుకున్న సమయానికి టీచర్ల భర్తీ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఆ దిశగా కార్యాచరణ రూపొందించినట్లు అర్థమవుతోంది. డీఎస్సీ నోటిఫికేషన్ కంటే ముందుగా సిలబస్‌ను విడుదల చేయాలని మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్సీలు చిరంజీవి రావు, శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి వినతిపత్రం సమర్పించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన మంత్రి నారా లోకేష్ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ నోటిఫికే షన్‌పై మంత్రి నారా లోకేష్ ఇటీవల ఏపీ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి డిఎస్సీ నియామకాలు పూర్తి చేయా లని లక్ష్యంగా పెట్టుకున్నట్టు లోకేష్ అసెంబ్లీలో చెప్పారు కూడా. ఈ సందర్భం గా ఉపాధ్యాయుల సమస్యలు, నియమ కాలు, టీచర్ల విధులపై సభలో పలువురు అడిగిన ప్రశ్నలకు లోకేష్ సమాధానమిచ్చారు.

## సికింద్రాబాద్ రైళ్లలో సీరియల్ కిల్లర్.. 35 రోజుల్లో 5 హత్యలు




ఓ సైకో రైళ్లలో ప్రయాణిస్తూ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వరుస హత్యలకు పాల్పడుతున్నాడు. తెలివిగా ఇతగాడు రైళ్లలోని చివరిభోగీలో ఉండే వికలాంగ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కి ప్రయాణికులపై అత్యాచారం, హత్యలు చేయడానికి అలవాటు పడ్డాడు. ఇలా ఏడాది అక్టోబర్ 17 నుంచి నవంబర్ 24 మధ్య 35 రోజుల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో సంచరిస్తూ ఐదు రాష్ట్రాల్లో ఐదు మర్డర్లు చేశాడు. గుజరాత్‌లోని వల్సాద్ పోలీసులు సోమవారం (నవంబర్ 26) పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. వల్సాద్ ఎస్పీ డాక్టర్ కరణ్‌రాజ్ సింగ్ వాఘేలాను ఈ సీరియల్ కిల్లర్ వివరాలను మీడియాకు వెల్లడించారు. అతడి పేరు భోలో కరమ్‌వీర్ జాట్ అలియాస్ రాహుల్. హర్యానాలోని రోహ్తక్‌లో ఉన్న మోక్రా ఖాస్ స్వస్థలం. గతంలో రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌ల్లో నేరాలు చేశాడు. ఇటీవల రైల్వేలో సీరియల్ కిల్లర్‌గా మారాడు. విచారణలో ఇతగాడి నేరాల చిట్టామొత్తం బయటపడింది. ఆదివారం ఉదయం సికింద్రాబాద్‌లోని ఓ రైలులోని వికలాంగుల పెట్టెలో మహిళ మృతదేహం కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సికింద్రాబాద్ జీఆర్పీ అధికారులకు వల్సాద్ పోలీసులు సమాచారం ఇచ్చా రు. ఈ హత్య తానే చేసినట్లు కరమ్‌వీర్ అంగీకరించాడు. దీంతో నగర పోలీసులు పీటీ వారెంట్‌పై కరమ్‌వీర్‌ను హైదరాబాద్‌కి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. హర్యానాకు చెందిన కరమ్‌వీర్‌కు చిన్నతనంలోనే ఎడమ కాలికి పోలియో సోకింది. ఫలితంగా చిన్నతనం నుంచే ఒంటరిగా ఉంటూ, విచిత్రంగా ప్రవర్తించేవాడు. దీంతో అతడి కుటుంబం కూడా దూరంగా పెట్టింది. ఐదో తరగతితో చదువు మానేసిన కరమ్‌వీర్.. లారీ క్లీనర్‌గా పని చేస్తూ డ్రైవింగ్ నేర్చుకున్నాడు. పోలియో ఉండటంతో ఇతడికి ఎవరూ డ్రైవర్‌గా ఉద్యోగం ఇవ్వలేదు. దీంతో హైవే దాబాలో పనిచేస్తూ.. అక్కడ పార్క్ చేసి ఉన్న లారీలను ఎత్తుకెళ్లడం ప్రారంభించాడు. అలా నేరాల బాటపట్టిన అతడు చోరీలు, కిడ్నాప్‌లు చేస్తుండేవాడు. దీంతో రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల్లో అతడిపై 13 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది మే వరకు రాజస్థాన్‌లోని జోద్‌పూర్ జైల్లో ఉన్న కరమ్‌వీర్.. బెయిల్‌పై విడుదలై బయటకు వచ్చాడు. ఆ తర్వాత రైళ్లల్లో దివ్యాంగుల కోసం చివరలో ఉండే బోగీలపై ఇతడి కన్ను పడింది. రైళ్లలో దివ్యాంగుల బోగీలో ప్రయాణిస్తూ అక్టోబర్ 17న తొలి హత్య చేశాడు.

## అదానీ వ్యవహారంపై డిప్యూటీ సీఎం పవన్ కీలక వ్యాఖ్యలు

ఢిల్లీపర్యటనలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్.. నాన్‌స్టాప్ భేటీలతో బిజీబిజీగా గడుపుతున్నారు.. మంగళవారం కేంద్రమంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, సీఆర్ పాటిల్, అశ్విని వైష్ణవ్, నిర్మలా సీతారామన్ ఇలా పలువురు నేతలతో భేటీ అయిన పవన్ కల్యాణ్.. రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చలు జరిపారు.. కాగా.. పవన్ కల్యాణ్ బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ కానున్నారు. దానికి ముందు పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అవుతున్నారు. ఈ క్రమంలో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ను పవన్ కల్యాణ్ కలిశారు.. ఎర్రచందనం అమ్మకాలు, ఎగుమతుల ప్రక్రియను సింగల్ విండో విధానానికి మార్చాలని, దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే 'ఈ -వేలం'లో మెరుగైన ఫలితాలు వస్తాయని తెలియచేశారు. ఎర్రచందనం రక్షణ, స్మగ్లింగ్ నిరోధం, దుంగల అమ్మకం విషయంలో అనుసరిస్తున్న విధానాల మీద కేంద్ర మంత్రితో చర్చించారు. రూ.110 కోట్లఎర్ర చందనం దుంగలను కర్ణాటకలో దొరికితే, వాటిని ఆ రాష్ట్రం అమ్మేసిందని. అదే ఎర్ర చందనం ఇతర దేశాల్లో దొరికితే తిరిగి తెప్పించుకోవచ్చంటూ పేర్కొన్నారు.. నేపాల్ నుంచి కూడా అలాగే రప్పించామన్నారు.. విదేశాల విషయంలో ట్రీటీ ఉన్నట్టుపొరుగు రాష్ట్రాల్లో దొరికినప్పుడు ఎక్కడి నుంచి తెచ్చారో అక్కడికి చేరవేసే విధానం లేదని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర పర్యావరణ శాఖ మంత్రితో మాట్లాడానని.. సొంత రాష్ట్రానికి అప్పగించేలా చర్యలు చేపట్టాలని కోరానని తెలిపారు.

బెంగళూరును వీడిన మహ్మద్ సిరాజ్..

## భావోద్వేగానికి గురైన హైదరాబాదీ బౌలర్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ మెగా వేలం సోమవారంతో ముగిసింది. చాలా వరకు జట్లు కొత్త వారిని తీసుకునేందుకు ఆసక్తి చూపించాయి. ఈ క్రమంలో పాత వారిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించలేదు. హైదరాబాదీ స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌ను రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించలేదు. రైట్ టు మ్యాచ్‌ని సైతం ఉపయోగించుకునేందుకు ఇంట్రెస్ట్ చూపించలేదు. ఈ దాంతో ఏడేళ్ల అనంతరం మహ్మద్ సిరాజ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వీడాల్సి వచ్చింది. ఈ క్రమంలో మహ్మద్ సిరాజ్ భావోద్వేగానికి గురయ్యాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌ని పెట్టాడు. ఈ సందర్భంగా తన మనసులోని భావాలను వ్యక్తం చేశాడు. ఆర్‌సీబీ తన హృదయానికి దగ్గరైందని.. ఈ ప్రయాణం ఓ అసాధారణ అనుభవం కంటే తక్కువ కాదని పేర్కొన్నాడు. తాను తొలిసారిగా ఆర్‌సీబీ జెర్సీని ధరించిన రోజు.. తాము ఇంత దగ్గరవుతామని ఎప్పుడూ అనుకోలేదని.. ఆర్సీబీ జెర్సీ ధరించి వేసిన మొదటి బంతి, తీసిన ప్రతి వికెట్, ఆడిన ప్రతి మ్యాచ్, మీతో గడిపిన ప్రతిక్షణం, ఈ ప్రయాణం అసాధారణ అనుభవం కంటే తక్కువ కాదు.. ఇందులో హెచ్చుతగ్గులున్నాయి కానీ.. ఒక విషయం స్థిరంగా ఉందని.. అది తిరుగులేని మద్దతు అంటూ స్పందించాడు. ఐపీఎల్ మెగా వేలానికి ముందు సిరాజ్‌ను ఆర్‌సీబీ రిలీజ్ చేసింది. ఆర్‌సీబీ కేవలం ముగ్గురు ఆటగాళ్లనే రిటైన్ చేసుకొని.. మిగతా వారందరినీ రిలీజ్ చేసింది. ఇందులో విరాట్ కోహ్లీని రూ.21కోట్లకు, రజత్ పటీదార్ రూ.11కోట్లు, యశ్ దయాల్ రూ.4కోట్లకు అట్టిపెట్టుకున్నది. సిరాజ్ రూ.2కోట్ల బేస్ ప్రైస్‌తో వేలానికి రాగా.. గుజరాత్ టైటాన్స్ రూ.12.25కోట్ల కొనుగోలు చేసింది. ఆర్‌సీబీ తరఫున సిరాజ్ 87 మ్యాచులు ఆడి.. 83 వికెట్లు తీశాడు. మొదట సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఐపీఎల్ కెరీర్‌ను ప్రారంభించిన సిరాజ్.. 2018లో ఆర్‌సీబీ తరఫున ఎంట్రీ ఇచ్చాడు. గత సీజన్‌లో 14 మ్యాచుల్లో 15 వికెట్లు పడగొట్టాడు.

## ట్రెండింగ్‌లో బుజ్జితల్లి సాంగ్

అక్కినేని నాగచైతన్య నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'తండేల్' ప్రేక్షకుల్లో మంచి అంచనాలను క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు చందు మొండేటి డైరెక్ట్ చేస్తుండగా పూర్తి రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ మూవీ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. ఇక రీసెంట్‌గా ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ సాంగ్ 'బుజ్జి తల్లి' రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటకు దేవిశ్రీ ప్రసాద్ అందించిన మెలోడీ ట్యూన్ ప్రేక్షకులపై మ్యాజిక్ చేసింది. ఇక చార్ట్‌బస్టర్స్‌లోనూ ఈ పాట ట్రెండ్ అవుతూనే ఉంది. ఈ పాటకు యూట్యూబ్‌లో ఏకంగా 10 మిలియన్ వ్యూస్ దక్కాయి. ఈ పాట ప్రేక్షకులకు స్లోగా ఎక్కుతుందని మేకర్స్ ముందుగా చెప్పినట్లుగా ఇది ఆకట్టుకుంటుండటంతో చిత్ర యూనిట్ సంతోషం వ్యక్తం చేస్తోంది. ఇక ఈ సినిమాలో అందాల భామ సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తుండటంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఫిబ్రవరి 7న ఈ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

